క్లుప్తంగా

జగనన్నే మా భవిష్యత్ విజయవంతం



బొర్రంపాలెంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ బాల సూర్యనారాయణరాజు

టి.నరసాపురం : జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం విజయవంతం కావడం ద్వారానే రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం మళ్లీ ఖాయమనే విషయం తేటతెల్లమైందని జెడ్పీటీసీ సామంతపూడి బాల సూర్యనారాయణరాజు అన్నారు. బొర్రంపాలెంలోని ఆయన అతిథి గృహం వద్ద మంగళవారం సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వచ్చిందన్నారు. ఈ కార్యక్రమాన్ని మరింత ఉత్సాహంగా ముందుకు కొనసాగించాలని సచివాలయ కన్వీనర్‌లకు సూచించారు. జేసీఎస్ కన్వీనర్ ఉమ్మడి సాయితేజ, నాయకులు యర్రా గంగాధరరావు, దాసరి రాంబాబు, బోళ్ల రంగారావు, బొడ్డు శ్రీను, సచివాలయం కన్వీనర్‌లు పాల్గొన్నారు.

జగన్‌తోనే పేదలకు న్యాయం



లబ్ధిదారులతో జెడ్పీటీసీ కడిమి రమేష్

కామవరపుకోట : సీఎం వైఎస్ జగన్‌తోనే పేదలకు న్యాయం జరుగుతుందని జెడ్పీటీసీ కడిమి రమేష్ అన్నారు. మంగళవారం మండలంలోని ఆడమిల్లి గ్రామం నందు నూతనంగా నిర్మించిన జగనన్న కాలనీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలతో ప్రజలను మోసం చేయగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హులైన వారందరికీ ఇళ్లు మంజూరు చేశామన్నారు. ఆడమిల్లి గ్రామం నందు 115 మందికి ఇళ్ల స్థలాలు ఇవ్వగా దాదాపుగా 80 శాతం లబ్ధిదారులు గృహాలు నిర్మించుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఉప్పలపాటి సాయిబాబా, ఉప సర్పంచ్ శ్రీను, దొడ్డి మనోహరం, వేముల సాయి, నందిగాం శ్రీను, రుద్రపాక మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు



అభివృద్ధి కార్యక్రమాలపై సబ్‌కలెక్టర్ సమీక్ష

చింతలపూడి : నగర పంచాయతీ పరిధిలోని అన్ని ప్రాంతాలకు తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటామని నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ అన్నారు. మంగళవారం నగర పంచాయతీ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఎస్టీ హాస్టల్ వెనుక నివాసం ఉంటున్న కాలనీ వాసులతో వారి సమస్యలపై చర్చించారు. త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. బోయగూడెం సమీపంలో అనధికార లేఅవుట్‌లను పరిశీలించారు. అనంతరం స్థానిక రోడ్లు, భవనాల అతిథి గృహంలో అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ ఎన్.రాంబాబు, మండల అధికారులు పాల్గొన్నారు.

షాదీఖానా నిర్మించాలని వినతి

కొయ్యలగూడెం : ముస్లిం వర్గానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎప్పుడూ రుణపడి ఉంటుందని, వారి అభివృద్ధికై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెనుకాడబోరని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారు. బయన్నగూడెంలో జామియా మసీద్‌కి షాదీఖానా నిర్మించాలని మంగళవారం ముస్లిం సోదరులు ఎమ్మెల్యేకి వినతి పత్రం సమర్పించారు. దీనిపై ఎమ్మెల్యే బాలరాజు స్పందిస్తూ జిల్లా పరిషత్ నిధుల ద్వారా సుమారు రూ.10 పది లక్షల నిధులను విడుదల చేయించి షాది ఖానా నిర్మిస్తామని జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మితో కలిసి హామీ ఇచ్చారు. ఇందుకు సంబంధించి వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పంచాయతీరాజ్ శాఖ అధికారులకు ఆయన ఆదేశాలు జారీ చేశారు.

అర్హులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ

వేలేరుపాడు : అర్హులైన నిర్వాసితులందరికీ పోలవరం ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అందనున్నట్లు వేలేరుపాడు తహసీల్దార్ కె.చల్లన్నదొర పేర్కొన్నారు. మంగళవారం టేకూరు గ్రామంలో ఆర్‌అండ్‌ఆర్ గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో ఉన్న మొత్తం 178 మంది లబ్ధిదారుల పేర్లు చదివి వినిపించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ మంజూరైన 20 మంది నిర్వాసితులు చనిపోయారన్నారు. చనిపోయిన కుటుంబ సభ్యుల్లో అర్హులు ఉంటే వారికి ప్యాకేజీ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆర్‌అండ్‌ఆర్ మంజూరుకాని అర్హులైన నిర్వాసితులుంటే దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. టేకూరు గ్రామ నిర్వాసితులు జీలుగుమిల్లి మండలం రౌతుగూడెం శివారుగ్రామమైన పాకలగూడెంలో పునరావాసం కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ వల్లా లక్ష్మీదేవి, జెడ్పీటీసీ గుజ్జా రామలక్ష్మి, కట్కూరు సర్పంచ్ లక్ష్మణ్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కేసగాని శ్రీనివాసగౌడ్, కామినేని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభంజనాన్ని ఏ శక్తీ అడ్డుకోలేదు

విలేకరుల సమావేశంలో
గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



జగనన్నే మా భవిష్యత్ మెగా పీపుల్స్ సర్వే కరపత్రాన్ని చూపుతున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, పార్టీ నేతలు

ద్వారకాతిరుమల : వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభంజనాన్ని ఏ శక్తీ అడ్డుకోలేదని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. ద్వారకాతిరుమల మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆయన పార్టీ నేతలతో కలసి మెగా పీపుల్స్ సర్వే కరపత్రాలను మంగళవారం ప్రదర్శించారు. అనంతరం ఎమ్మెల్యే విలేకర్లతో మాట్లాడారు. ఈనెల 7 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 15 వేల సచివాలయాల పరిధిలో 'జగనన్నే మా భవిష్యత్తు' పేరుతో పీపుల్స్ సర్వే చేపట్టామన్నారు. ఈ సర్వేలో 7 లక్షల మంది పార్టీ సైనికులు పాల్గొంటున్నారని, ఇప్పటి వరకు కోటికి పైగా కుటుంబాలను సర్వే చేయగా జగనన్నకు మద్దతుగా 79 లక్షల కుటుంబాల నుంచి మిస్డ్ కాల్స్ రావడం జరిగిందన్నారు. ఈనెల 29 లోగా రాష్ట్రంలోని 1.65 లక్షల కుటుంబాలను సందర్శించడమే వైఎస్సార్ సీపీ లక్ష్యమన్నారు. కుల, మత, వర్గ వివక్ష లేకుండా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నామని, ఈ విషయాలను ప్రతిపక్ష నాయకులకు, కార్యకర్తలకు సైతం వివరిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రజలంతా జగనన్నకు అండగా నిలుస్తున్నారని అన్నారు. ఈ సర్వే రిపోర్టులు చూసి ప్రతిపక్ష టీడీపీలో వణుకు మొదలైందన్నారు. రాష్ట్రంలో నాలుగేళ్లుగా సీఎం జగన్ పార్టీలకు, కులాలకు, ప్రాంతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తుండటమే ఇందుకు కారణమన్నారు. గతంలో ఏ ప్రభుత్వమైనా ఒక్కో కుటుంబానికి ఇన్ని సంక్షేమ పథకాలు అందించిందా అని ఆయన ప్రశ్నించారు. అన్ని వర్గాల వారికి తమ ప్రభుత్వం మేలు చేస్తుంది గనుకే.. ప్రతి గడపకూ వెళ్లి ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలను బుక్‌లెట్ రూపంలో లబ్ధిదారులకు ధైర్యంగా అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బొండాడ మోహిని, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, స్థానిక సర్పంచ్ కుంటం స్వర్ణలత, ఎంపీటీసీలు పెద్దిరెడ్డి రమ్య కుసుమ, రుద్ర నాగసూర్యకళ, దాకారపు బంగారమ్మ, బొండాడ వెంకన్నబాబు, పెద్దిరెడ్డి జ్యోతిశ్రీనివాస్, షేక్ భాషా, గుర్రాల లక్ష్మణ్, భోగరాజు చిన్నచిన్ని, మానుకొండ ప్రసాద్, కన్నయ్య, కేవీఆర్, లక్కాబత్తుల సిద్ధిరాజు, దిర్శిపాం అన్నవరం, ఆచంట బన్ను, పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, రుద్ర శివాజీ, అల్లాడ హరేరామకృష్ణ, బిరుదుగడ్డ చల్లారావు, మానుకొండ రాంబాబు, జేవీకే రెడ్డి, మానుకొండ భీమయ్య, మానుకొండ షహీల తదితరులున్నారు.

జగన్ పాలనలో సంక్షేమ రాజ్యం

కొయ్యలగూడెం : రాష్ట్రంలో నడుస్తున్నది సంక్షేమ యుగం అని వర్తమాన, భవిష్యత్ కాలాలలో 'సక్సెస్ ఫుల్ ముఖ్యమంత్రి' అనే పదానికి ఐకాన్‌గా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిలిచిపోతారని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారు. మంగళవారం బయ్యనగూడెం గ్రామంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు తుమ్మలపల్లి గంగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను ఇతర రాష్ట్రాలలో అమలు చేయడానికి ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు పరిశీలకులను పంపి అధ్యయనం చేస్తున్నారని, ఇది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి, పార్టీ శ్రేణులకు గర్వకారణమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వివిధ ప్రభుత్వ శాఖలలో నిరుద్యోగ యువతకు ప్రవేశపెట్టిన ఉద్యోగ అవకాశాలు అన్నింటిని తాము అధికారంలోకి వస్తే కొనసాగిస్తామని చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేష్ బాబు చెప్పడంతోనే వైఎస్ జగన్ విధానాలను ఎవరైనా అమలు చేయాల్సిందే అన్న సత్యం అవగతమవుతోందన్నారు. లోకేష్ బాబుకు వచ్చిన స్పష్టమైన తెలుగు పదం 'ఏంపీకలేదు' అన్నది మాత్రమే అని ఆయన తెలుగు భాషకు పట్టిన తెగులు వంటి వాడని ఎద్దేవా చేశారు. పంచాయతీ వార్డు సభ్యుడుగా కూడా లోకేష్ బాబు పనికిరాడని విమర్శించారు. గడపగడపకు కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులు శ్రద్ధ చూపాలన్నారు. ప్రభుత్వ నిర్మాణాత్మక కార్యక్రమాలలో ప్రజాప్రతినిధులకు సమాచారం అందించాలని, ప్రోటోకాల్ తూచా తప్పకుండా పాటించాలని ఎమ్మెల్యే బాలరాజు అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పోతన తాతారావు, పీఏసీఎస్ చైర్మన్ కోరుకొండ బాపిరాజు, సర్పంచ్ ఎల్.అనంతలక్ష్మి, ఉప సర్పంచ్ కోరుకొండ లలిత, సచివాలయ కన్వీనర్ భవిరిశెట్టి సుబ్బారావు, మీసాల సూర్యచంద్రం, కె.విఘ్నేష్, వుక్కుర్తి నీలయ్య, బాలం వెంకట్రామయ్య, కంభంపాటి బుజ్జిబాబు, బాలం సూరిబాబు, అల్లం సూరిబాబు, మెట్టా ప్రసన్న, పూలసరి సత్యవతి తదితరులు పాల్గొన్నారు.



బయ్యనగూడెంలో సంక్షేమ లబ్ధి కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు



అక్కంపేటలో సీమంతాల కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఎలీజా

అర్హులకు సంక్షేమ లబ్ధి చేకూర్చడమే లక్ష్యం

జంగారెడ్డిగూడెం రూరల్ : అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. మండలంలోని అక్కంపేటలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎలీజా ప్రజల వద్దకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నవరత్నాల పథకాలతో ప్రతి కుటుంబంలో సంక్షేమ లబ్ధి చేకూరిందన్నారు. టీడీపీ హయాంలో ప్రభుత్వ పథకాలు పొందాలంటే జన్మభూమి కమిటీలు చెప్పిన వారికే ఇచ్చేవారని, అది కూడా వారి పార్టీకి చెందిన వారికి మాత్రమే అందించేవారన్నారు. కానీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కుల, మత, వర్గ, పార్టీలు చూడకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలను అందించిందన్నారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే సంక్షేమ పాలనను తీసుకొచ్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే ఎలీజా అన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా 2024 ఎన్నికల్లో మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకునేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, సర్పంచ్ పారేపల్లి నాగేంద్ర, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, ఉప సర్పంచ్ వింజమూరి కిరణ్ కిషోర్, వైస్ ఎంపీపీ నరెడ్ల బుజ్జిబాబు, సచివాలయాల మండల కన్వీనర్ గురజాల పార్థశారధి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేడు మంత్రి కారుమూరి పర్యటన

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని శ్రీనివాసపురంలో బుధవారం రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు పర్యటిస్తున్నట్లు జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి తెలిపారు. ఉదయం 11 గంటలకు ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా అధ్యక్షతన వైఎస్సార్ విలేజ్ క్లినిక్, రైతు భరోసా కేంద్రాన్ని మంత్రి ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కోటగిరి శ్రీధర్ పాల్గొంటారన్నారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొనాలని కోరారు.

ముమ్మరంగా ఉపాధి పనులు

చింతలపూడి : మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లో గ్రామీణ ఉపాధి హామీ పనులు ముమ్మరంగా జరుగుతున్నట్లు ఉపాధి హామీ ఏపీఓ మోహినీ కుమారి తెలిపారు. సీతానగరంలో మంగళవారం ఉపాధి హామీ పనులను పరిశీలించి మస్టర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి రోజు మండలంలో 5,200 మంది ఉపాధి పనులకు హాజరవుతున్నారని, కనీస కూలి రూ. 272 ఇస్తున్నట్లు తెలిపారు. మండలంలో మొత్తం 140 పనులు మంజూరయ్యాయని వాటిలో పంట కాల్వలు, చెరువు పనులు ఉన్నాయన్నారు.

పలు అభివృద్ధి పనుల ప్రారంభం

ద్వారకాతిరుమల : తమ ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బుట్టాయిగూడెంలో రూ. 21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని, గుళ్లపాడులో రూ.5 లక్షలతో నిర్మించిన మంచినీటి బోరును, నారాయణపురంలో రూ. 40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు. అలాగే గుళ్లపాడులో సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బొండాడ మోహిని, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, సర్పంచ్‌లు పెద్దిన దిలీప్, కేతా వెంకట నాగసుబ్రహ్మణ్యం, దాకారపు బంగారమ్మ, పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు మల్లెపూడి నాగమణి, పార్టీ గ్రామ కమిటీల అధ్యక్షులు పెండ్యాల నాగేశ్వరరావు తదితరులున్నారు.

గ్రామాల్లో మంచినీటి ఎద్దడి ఉండకూడదు

ద్వారకాతిరుమల : ప్రస్తుత వేసవిలో ఏ గ్రామంలోను మంచినీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అధికారులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ బొండాడ మోహిని అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యే తలారి ముఖ్య అతిథిగా పాల్గొని, అన్ని శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత వేసవిలో తాగునీటికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అందులో భాగంగా వెంకటకృష్ణాపురం, ఐఎస్ రాఘవాపురం ఎస్సీ కాలనీల్లో, దొరసానిపాడు, సాయన్నపాలెం, బుట్టాయిగూడెంలోని రెండు ప్రాంతాల్లో నిర్మించిన బోర్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. కొమ్మరలో బోరుకు నూతన మోటారును ఏర్పాటు చేస్తామని, అలాగే కోడిగూడెం బీసీ కాలనీలో నూతన బోరును మంజూరు చేస్తామన్నారు. పంగిడిగూడెంలో ప్రభుత్వ ఇళ్ల స్థలాల లేఅవుట్ మీదుగా వెళ్లిన 33 కేవీ విద్యుత్ లైన్‌ను షిఫ్ట్ చేయాలన్నారు. మండలంలో ఇంకా 546 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాల్సి ఉందన్నారు. భూమి కొనుగోలు చేసైనా వారికి త్వరలో స్థలాలు ఇస్తామన్నారు. దొరసానిపాడు, తిరుమలంపాలెం గ్రామాల్లో లేఅవుట్‌లపై ఉన్న కోర్టు వివాదాలు తొలగిపోయాయన్నారు. త్వరలో అక్కడి లబ్ధిదారులకు పట్టాలను పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఏవీ సుబ్బరాయన్, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, వైస్ ఎంపీపీ ఓగిరాల చంద్ర, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రామారావు, పీఆర్‌ఏఈ ఎం.వెంకటేశ్వరరావు, ఉద్యానశాఖ మండల అధికారి దేవదానం, ఏఓ దుర్గారమేష్, పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.



బుట్టాయిగూడెంలో రైతు భరోసా కేంద్ర శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తలారి

అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు చేపడతాం

జంగారెడ్డిగూడెం : పాలకవర్గం, అధికారులు సమన్వయంతో పనిచేసి పట్టణాభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు తమ వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టడం లేదని, నిధులు కేటాయింపులో వివక్ష చూపుతున్నారని సభ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై చైర్‌పర్సన్ మాట్లాడుతూ అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు చేపడతామని పేర్కొన్నారు. బాగా వెనుకబడిన వార్డుల్లో ముందుగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని స్పష్టం చేశారు. ప్రాధాన్యత క్రమంలో పనులను చేపట్టి అన్ని వార్డులను అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. కాగా, పట్టణంలో చేపట్టే సీసీ రోడ్లు, డ్రెయిన్‌ల నిర్మాణాలకు, పలు అభివృద్ధి పనులకు టెండర్లు ఖరారు చేశారు. సమావేశంలో వైస్‌చైర్మన్ ముప్పిడి అంజి, కమిషనర్ పి.భవానీ ప్రసాద్, మేనేజర్ కేవీ రమణ, టీపీవో జగదీష్, ఆర్ఐ సుబ్బారావు, ఏఈ సంధ్య తదితరులు పాల్గొన్నారు.



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి

కౌన్సిల్ ఆమోదం తెలిపిన అంశాలు

- 9, 12, 7, 25, 8వ వార్డుల్లో రూ. 81.90లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం.
- 8, 12, 22 వార్డుల్లో రూ.13.50 లక్షలతో సీసీ డ్రెయిన్ల నిర్మాణం.
- 29వ వార్డులో రూ.5.50 లక్షలతో పైప్‌లైన్ నిర్మాణం.
- రూ.1.80 లక్షలతో ఫాగింగ్ మిషన్‌లు కొనుగోలు.
- పట్టణంలో ప్రధాన రహదారి గుండా జేపీ సెంటర్ నుంచి సాలిపేట మీదుగా కాలేజీ రోడ్డు జంక్షన్ వరకు రూ.70 లక్షలతో సీసీ రోడ్డు, సీసీ డ్రెయిన్ నిర్మాణం.

శరవేగంగా సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మిస్తాం

కొయ్యలగూడెం : వేసవిలో రూ.40 లక్షల నిధుల ద్వారా శరవేగంగా సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మాణం పూర్తిచేస్తామని పరింపూడి పంచాయతీ సర్పంచ్ ముప్పిడి విజయ కుమారి పేర్కొన్నారు. మంగళవారం పరింపూడి రామాలయం వద్ద చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఆమె మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు మట్టా వనజాక్షితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మత్స్యకారులకు కన్నాపురం రోడ్డులో నిర్మిస్తున్న ఫిష్ ఆంధ్రా భవన నిర్మాణ పనులు నెల రోజుల్లో పూర్తి చేయాల్సిందిగా ఎమ్మెల్యే బాలరాజు ఆదేశాలు జారీ చేశారన్నారు. భవన నిర్మాణ పనులకు ఏర్పడిన ఆటంకాలను ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారన్నారు. వైఎస్సార్ నగర్, ఎస్సీ ఏరియాలో అసంపూర్తిగా మిగిలిన సీసీ రోడ్ల పనులు రూ.2 లక్షల పంచాయతీ, 15వ ఫైనాన్స్ నిధులతో చేపట్టినట్లు పంచాయతీరాజ్ ఏఈ జగన్నాథం తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు మంతెన సోమరాజు, మాజీ ఎంపీపీ మట్టా సత్తిపండు, ఉప సర్పంచ్ శంకు కొండ, ఎంపీటీసీ గంటా శ్రీను, వార్డు సభ్యులు రాచూరి మదన్, పూలపల్లి రవి, వూసల రాజేష్, తదితరులు పాల్గొన్నారు.



పరింపూడి రామాలయం వద్ద సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

టేకూరులో జగనన్నే మా భవిష్యత్

వేలేరుపాడు : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గిరిజన గ్రామాలు అభివృద్ధి పథంలో పయనిస్తున్నాయని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కేసగాని శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. మండలంలో మారుమూల గ్రామమైన టేకూరులో మంగళవారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరుపేదలను సంక్షేమ పథకాల ద్వారా జగనన్న ఆదుకుంటున్నారన్నారని అన్నారు. అనంతరం జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ ఇండ్లకు స్టిక్కర్లు వేశారు. కార్యక్రమంలో మండల సచివాలయ కన్వీనర్ కొలూరి సత్తిరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు కామినేని వెంకటేశ్వరావు, జెడ్పీటీసీ గుజ్జా రామలక్ష్మి, ఎంపీపీ వల్లా లక్ష్మీదేవి, సర్పంచ్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ లబ్ధి బుక్‌లెట్లతో ప్రజలు

డ్రైడేను పాటించి మలేరియాను నివారించాలి



బుట్టాయగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

బుట్టాయగూడెం : ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి దోమల నివారణకు సహకరిస్తే మలేరియాను పూర్తిగా నివారించవచ్చని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ రాజీవ్, ఎంపీడీఓ ఎం.శ్రీహరి అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవ సందర్భంగా బుట్టాయగూడెంలో వైద్య ఆరోగ్యశాఖ, మలేరియా సిబ్బంది భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దోమతెరలు వాడటం ద్వారా మలేరియా రాకుండా నివారించవచ్చని అన్నారు. అలాగే గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక సామాజిక ఆరోగ్యకేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ కిషోర్ నాయక్, మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ వి.పెద్దిరాజు, డాక్టర్‌లు జనార్ధన్, సుధాకర్, దుర్గాప్రసాద్, సిబ్బంది బాలాజీ, దుర్గాప్రసాద్, చిన్నబాబు పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : మలేరియా వ్యాప్తిని అరికట్టేందుకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీఎల్‌డీవో ఎం.రాజు, మున్సిపల్ కమిషనర్ పి.భవానీప్రసాద్‌లు అన్నారు. జంగారెడ్డిగూడెం 8వ వార్డు సాయిసూర్యనగర్‌లో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం వార్డులోని డ్రెయిన్‌ల పూడికతీత పనులు, శానిటేషన్, దోమల నివారణ చర్యలు చేశారు.

ఫ్యామిలీ డాక్టర్‌ను సద్వినియోగం చేసుకోండి

చింతలపూడి : ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ డా బి రాంబాబు నాయక్ అన్నారు. మంగళవారం రేచర్ల వైఎస్సార్ హెల్త్ క్లినిక్ వద్ద 104 వాహనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్ చేయడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృత నిశ్చయంతో ఉన్నారని చెప్పారు. ప్రతి పీహెచ్‌సీకి ఒక 104 వాహనం ఇవ్వడం ఇందుకు నిదర్శనమన్నారు. సర్పంచ్ కె శివరామకృష్ణ, యర్రగుంటపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారిణి డా.మానస, సిబ్బంది పాల్గొన్నారు.

గూటాలలో కొనుగోలు కేంద్రం

పోలవరం రూరల్ : గిట్టుబాటు ధర కల్పిస్తూ రైతులకు అందుబాటులో ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని గూటాల సొసైటీ అధ్యక్షుడు సుంకర అంజిబాబు కోరారు. గూటాల గ్రామంలోని పీఏసీఎస్ వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు దత్తి రాంబాబు, వ్యవసాయ అధికారి కె.రాంబాబు, ఎంపీటీసీ సభ్యుడు దెగపాటి హరిరామకృష్ణ, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

పోలవరం రూరల్ : స్థానిక డీఎస్పీ కార్యాలయం ఎదురుగా మంగళవారం ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని డీఎస్పీ కె.లతాకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎండతీవ్రత ఎక్కువగా ఉండటంతో బాటసారుల తాగునీటి సౌకర్యార్థం చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐ కె.విజయబాబు, ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్‌లు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు

జంగారెడ్డిగూడెం : పట్టణంలో మంగళవారం వీహెచ్‌పీ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ గారి పేరున మజ్జిగ చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా పరిషత్ సభ్యులు కేవీఆర్ సత్యనారాయణ మాట్లాడుతూ ఆంధ్రుల అన్నపూర్ణ, నిరతాన్నదాత డొక్కా సీతమ్మ పేరుతో ఈ కార్యక్రమం నిర్వహించడం తమకెంతో ఆనందదాయకమని అన్నారు. పరిషత్ సభ్యులు కొంచాడ దుర్గాప్రసాద్, రవీంద్ర, మల్లిఖార్జునరావు, భూపతిదేవ్ పాల్గొన్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

పోలవరం రూరల్ : ఇద్దరు వ్యక్తుల మధ్య చోటుచేసుకున్న ఘర్షణలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ప్రగఢపల్లి గ్రామానికి చెందిన పాతాళ సోమరాజు భార్యతో అదే గ్రామానికి చెందిన గంగ్రోతు గోపి అనే వ్యక్తి అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడు. విషయం తెలుసుకున్న సోమరాజు గోపిని మందలించగా అతను కొడవలితో దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన సోమరాజును మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ వైద్యశాలకు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పాడిగేదెల మృతిపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: పాడిగేదెల మృతిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. వివరాలు ప్రకారం కేతవరం గ్రామానికి చెందిన యర్రమళ్ల వాసు మొక్కజొన్న సాగు చేస్తున్నాడు. నిత్యం వ్యవసాయ క్షేత్రం వద్దే పాడిగేదెలను కట్టి ఉంచుతాడు. వారం రోజుల క్రితం పక్క పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ షార్ట్ సర్క్యూట్ కావడంతో మొక్కజొన్న చేనుతో పాటు కట్టి ఉంచిన రెండు గేదెలు, ఒక దూడ విద్యుదాఘాతానికి గురై మృతిచెందాయి. ఈ ఘటనపై మంగళవారం రైతు వాసు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్సై చెప్పారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

కుక్కునూరు : కార్మికుల ఐక్య పోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.సోమయ్య అన్నారు. మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక సుందరయ్య భవనంలో మండల శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై కార్మికులు ఐక్య పోరాటాలు చేస్తేనే హక్కులు సాధించుకోగలరని ఉద్ఘాటించారు. సీఐటీయూ మండల అధ్యక్షురాలు కుంజా లక్ష్మి, కార్యదర్శి యర్నం సాయికిరణ్, మొడియం నాగమణి, బాడిస సుజాత, మెడవరపు రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.